క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



యాచకురాలికి చీర అందిస్తున్న చెల్లూరి

మల్కాపురం: దేవాలయాల వద్ద, ఫుట్‌పాతలపై గల యాచకులకు, పలువురు పేద మహిళలకు ఆదివారం సామాజిక సేవా కార్యకర్త, చిత్రకారుడు చెల్లూరి భాస్కర్‌రావు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా 200 చీరలను పారిశ్రామిక ప్రాంతంలోని పలు దేవాలయాల వద్ద, ఫుట్‌పాత్‌ల వద్ద యాచక మహిళలకు అందజేశానన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు



వాహన చోదకుడికి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ఎస్‌ఐ అప్పారావు

మల్కాపురం: మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని మల్కాపురం ట్రాఫిక్ ఎస్‌ఐ జి.అప్పారావు హెచ్చరించారు. సిబ్బందితో కలిసి ఆదివారం ఉదయం, సాయంత్రం మల్కాపురం, శ్రీహరిపురం, కోరమాండల్, సింధియా మొదలగు ప్రధాన కూడళ్లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర, భారీ వాహనాల చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేశారు. ముందుగా శ్రీహరిపురం వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఎస్‌ఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు స్టేషన్ పరిధిలోని పలు ముఖ్య కూడళ్లలో రెండు రోజులుగా వాహనాలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన వారు, ద్విచక్ర వాహనాలు నడిపిన మైనర్లు, ట్రిబుల్ డ్రైవింగ్, అతి వేగంగా వాహనాల నడిపిన వారిని పట్టుకుని వారి పత్రాలను పరిశీలించి, చోదకులపై చర్యలు తీసుకున్నామని వివరించారు.

పుస్తక పఠనంపై ఆసక్తి అవసరం



పుస్తక పఠనంలో నిమగ్నమైన చిన్నారులు

పెదగంట్యాడ: విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని గ్రంథాలయాధికారి పి.వి. రమణ సూచించారు. పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు పుస్తక పఠనంపై శిక్షణ ఇచ్చారు. కథలు చెప్పారు. విద్యార్థులతో గ్రంథ పఠనం చేయించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు.

మూగ జీవుల కోసం నీళ్ల కుండీల ఏర్పాటు

- బాలవికాస్ చిన్నారుల సేవానిరతి

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మూగ జీవుల కోసం నీళ్ల కుండీలు ఏర్పాటు చేశారు. సత్యసాయి సమితికి చెందిన బాలవికాస్ చిన్నారుల ఆధ్వర్యంలో కుండీలు నిర్మించారు. వేసవిలో మూగ జీవులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుండటం గమనించిన విద్యార్థులు సత్యసాయి సేవా మందిరం పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. కుండీలు ఏర్పాటు చేసి, అందులో నీటిని అందుబాటులో ఉంచారు. మూగ జీవుల పట్ల చిన్నారులకు ఉన్న ప్రేమను సమితి కన్వీనర్ జి.రామకృష్ణ అభినందించారు.

చెంతకే సర్కారు వైద్యం

- పేదలకు అందుబాటులో ఆరోగ్య కేంద్రాలు
- ఉచితంగా వైద్య, రక్త పరీక్షలు



కొత్తపాలెం ఆరోగ్య కేంద్రంలో లేబరేటరీ పరికరాలు



లక్ష్మీనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

గోపాలపట్నం: ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజల చెంతకు చేరువయ్యాయి. మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. 92వ వార్డు గోపాలపట్నం పరిధిలో గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రూ.5.50 కోట్లతో ఆధునికంగా తీర్చిదిద్దారు. ఇక్కడ అదనపు భవనాల నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఇక్కడ మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందుతున్నాయి. ఈ హెల్త్ సెంటర్‌లో 250 నుంచి 300 మంది వరకు నిత్యం వైద్య సేవలు పొందుతున్నారు.

- 89వ వార్డు కొత్తపాలెంలో రూ.1.70 కోట్లతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించారు. గతంలో ఇక్కడ వైద్య సేవలు పొందేందుకు స్థానికులు ఇబ్బంది పడేవారు. ఆస్పత్రి నిర్మాణంతో వారి కష్టాలు తీరినట్లయింది. రోజుకు సుమారు 25 నుంచి 30 మంది వైద్య సేవలు పొందుతున్నారు.
- 91వ వార్డు లక్ష్మీనగర్ యూపీహెచ్‌సీలో ప్రతి రోజూ 20 మంది వైద్య సేవలు పొందుతున్నారు. ఈ ఆరోగ్య కేంద్రాల్లో వారానికి ఒక రోజు స్పెషలిస్ట్ వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారు. డిజిటల్ ద్వారా వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తున్నారు. ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు పొందిన ప్రజలు చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవల కోసం వేచి ఉన్న స్థానికులు



ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్ష చేస్తున్న సిబ్బంది



కొత్తపాలెంలో నిర్మించిన ఆరోగ్య కేంద్రం

యారాడ బీచ్‌ను శుభ్రపరిచిన యువత, విద్యార్థులు



యారాడ బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న యువత, విద్యార్థులతో సీఐ దాలిబాబు

మల్కాపురం: యారాడ హెల్పింగ్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం యారాడ బీచ్ తీరంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జేపీ, ప్రైవేట్ స్కూళ్లకు చెందిన విద్యార్థులు, పలువురు యువత తీరంలోని వ్యర్థాలను తొలగించి పారిశుధ్య వ్యర్థాలను తరలించే వ్యాన్‌కు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ దాలిబాబు మాట్లాడుతూ బీచ్‌ను శుభ్రం చేసిన విద్యార్థులు, యువతను అభినందించి, సర్టిఫికెట్లు అందించారు. ఉన్నత చదువుతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ యువత ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో యారాడ హెల్పింగ్ యూత్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

మల్కాపురం: ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ) సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌పీసీఎల్ కల్యాణి గేటు నుంచి మల్కాపురం వరకు సాగిన ఈ ర్యాలీలో సంస్థ ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం యారాడ తీరం వద్ద అధికారులు, సిబ్బంది బీచ్ క్లీనింగ్ కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని అవగాహన కల్పించారు.



యారాడ బీచ్ తీరాన్ని శుభ్రం చేస్తున్న హెచ్‌పీసీఎల్ అధికారులు, సిబ్బంది

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. అర్చకుడు అప్పాజీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

నేత్రపర్వంగా తిరువీధి ఉత్సవం



తిరువీధిలో ఆకట్టుకున్న తీన్‌మార్ బ్యాండ్



ఊరేగింపులో పూజలందుకుంటున్న బంగారుమాంబ అమ్మవారు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో బంగారుమాంబ, నూకాంబిక, దుర్గాలమ్మ వార్ల నవరాత్రి పండగ మహోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ముగ్గురమ్మల ఉత్సవ విగ్రహాలను పూలమాలలతో అలంకరించి, గ్రామంలో తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ప్రతీ ఇంటి నుంచి మహిళలు బిందెలతో నీళ్లు తెచ్చి విగ్రహం వద్ద అమ్మవార్లకు చల్లదనం చేశారు. ఊరేగింపులో తీన్‌మార్ బృందం బ్యాండ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

దువ్వాడ స్టేషన్ మాస్టారుకు సత్కారం



స్టేషన్ మాస్టారు రామకృష్ణారావును సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా కనీస సౌకర్యాలు కల్పించడంలో స్టేషన్ మాస్టర్ ఎన్.ఆర్.కె.రావు ప్రత్యేక చొరవ తీసుకున్నారని దువ్వాడ రైల్వే స్టేషన్ యూజర్స్ అసోసియేషన్ కార్యదర్శి కంచుమూర్తి ఈశ్వర్ అన్నారు. ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న రామకృష్ణారావును కూర్మన్నపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల మన్ననలు పొందిన రామకృష్ణా రావు సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వి.జాషువా, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కోశాధికారి కె.వీర్రాజు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి



ప్రసంగిస్తున్న కమలానంద భారతి స్వామి

సీతంపేట: సమాజంలో నానాటికీ పెరిగిపోతున్న గుణ హీనత, కుసంస్కారంతో హిందూ సమాజం కుచించుకుపోయి సంకుచితమవుతోందని భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి అన్నారు. స్థానిక శంకరమఠంలో 'దేవాలయం కేంద్రంగా ధార్మిక, సామాజిక కార్యక్రమ నిర్వహణ' అనే అంశంపై ఆదివారం ఆయన ప్రసంగించారు. దేవాలయంలో దేవుడి ఎదుట కూర్చుని ఈ విషయాలపై చర్చించాలన్నారు. ప్రతి దేవాలయంలో హిందూ ధర్మ జాగరణ, హిందూ ధర్మ ప్రచారం, హిందూ ధర్మ రక్షణ జరగాలని, దీనికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలోని స్థితిగతులు, జీవన విధానం ఆలోచనలు, పద్ధతుల్లో వచ్చిన మార్పులు, వాటి పర్యావసానం, వాటి నియంత్రణకు అనుసరించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సభికులు అడిగిన ప్రశ్నలకు కమలానంద భారతి స్వామి సమాధానాలిచ్చి సందేహ నివృత్తి చేశారు.

చెత్త డబ్బాలు శిథిలం



అడుగు భాగాలు దెబ్బతిన్న చెత్త డబ్బాలు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డులో చెత్త సేకరణకు పనిముట్లు కరువయ్యాయి. చెత్త ఎత్తే డబ్బాలు పూర్తిగా శిథిలమవడంతో పారిశుధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు, వీధులను ఊడ్చిన తరువాత చెత్తను ఎత్తి వాహనాల్లోకి వేయాల్సి ఉంది. చెత్త ఎత్తేందుకు కొత్త డబ్బాలు లేవు. గతంలో ఇచ్చిన డబ్బాలు పూర్తిగా పాడయ్యాయి. అడుగు భాగాలు ఊడిపోయి చెత్త ఎత్తుతుంటే అవి పారిశుధ్య కార్మికుల మీదే పడుతున్నాయి. కాలువలు శుభ్రం చేసేందుకు పారలు, చెత్త తీసే సాధనాలు లేక నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సరైన పనిముట్లు ఏర్పాటు చేయాలని పలువురు పారిశుధ్య కార్మికులు కోరుతున్నారు.

చర్చికి సంగీత పరికరాల వితరణ



ఆడారి ఆనంద్‌కుమార్ సమకూర్చిన సంగీత పరికరాలను చర్చి నిర్వాహకులకు అందజేస్తున్న జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ ఆర్థిక సాయంతో 52వ వార్డు కరాస మెయిన్ రోడ్‌లోని వీసీఎం చర్చికి సమకూర్చిన సంగీత పరికరాలను ఆదివారం నిర్వాహకులకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అందజేశారు. చర్చిలో ప్రార్థనలు, సువార్త కార్యక్రమాల నిర్వహణకు అనువుగా సంగీత పరికరాలు అవసరమని నిర్వాహకులు జియ్యాని శ్రీధర్ ద్వారా ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన రూ.2 లక్షల విలువ గల రెండు సౌండ్ స్పీకర్లు, మైక్ సెట్, గిటార్ తదితర సంగీత పరికరాలను చర్చికి సమకూర్చారు. వీటిని చర్చి నిర్వాహకులకు శ్రీధర్ అందజేసి, వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనంద్‌కుమార్ రాజకీయాలకు అతీతంగా సేవచేసే గుణం ఉన్న వ్యక్తని కొనియాడారు. చర్చి అవసరాలను ఆయన దృష్టికి తీసుకెళ్తే వెంటనే సాయం చేసేందుకు ముందుకురావడం ఆయన గొప్ప మనసుకు నిదర్శనమన్నారు. చర్చి పాస్టర్ మాట్లాడుతూ అడిగిన వెంటనే సాయం అందించిన ఆనంద్‌కుమార్‌కు దైవజనులంతా కృతజ్ఞతతో కూడిన ఆశీస్సులు అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జియ్యాని శ్రీధర్‌ను చర్చి నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

అలరించిన సినీ గీతాలాపన పోటీ



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

మల్కాపురం: స్థానిక వేదిక వద్ద ఆదివారం పిల్లనగ్రోవి పిలుపు పేరిట నిర్వహించిన సినీ సంగీత పాటల పోటీ అలరించింది. తెలుగు, హిందీ చిత్రాల్లోని పలు పాటలను కళకారులు పాడి ఆహుతులను అలరించారు. గాయకులు ఉరుకూటి బాబూరావు యాదవ్, నూనెల పైడిరాజు యాదవ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి, అరకు, పాడేరు, గాజువాక, మల్కాపురం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో గాయకులు పాల్గొని వారు ఎంచుకున్న పాటలను పాడి ప్రేక్షకులను అలరించారు. ఒక్కో గాయకుడికి మూడు పాటల చొప్పున పోటీ జరిగింది. అనంతరం జంటగా పాటల పోటీ నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పోటీలో పాల్గొనే గాయనీ, గాయకులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో కిల్లాని పైడిరాజు యాదవ్, గొంప వెంకటేశ్వర్లు యాదవ్, నమ్మి లోకేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కథల పుస్తక పఠనంతో ఊహాశక్తి పెంపు



డ్రాయింగ్ వేస్తున్న చిన్నారులు

మల్కాపురం: కథల పుస్తకాలు చదవడం వల్ల ఊహాశక్తి పెరుగుతుందని, భాషా భావవ్యక్తీకరణ స్పష్టంగా ఉంటాయని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం చిన్నారులకు ఆటలు, నృత్యాలు, చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక కథను చదివి దానిలో నీతిని గమనించాలన్నారు. స్ఫూర్తిని ఇచ్చే కథలు, దేశ నాయకులు దేశ స్వాతంత్రం కోసం పోరాడిన కథలు, వారి చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి, గ్రంథాలయాధికారి అజయ్, రచయిత సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యంతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రెలీజియస్ ఫ్రీడం (ఐఏఆర్ఎఫ్) సంస్థ 125వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం బుల్లయ్య కళాశాల ఆవరణలోని గాంధీ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ కేకు కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యం ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందని, మత సామరస్యానికి ఐఏఆర్ఎఫ్ చేసిన కృషిని వివరించారు. మనిషికి ఉండే స్వేచ్ఛపై అభివృద్ధి ఆధారపడి ఉంటుందని, మత సామరస్యానికి స్వేచ్ఛ చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో ఆర్.కె.మిషన్ కార్యదర్శి స్వాసం నేద్యానంద స్వామి, ప్రభుత్వ ఖ్వాజీ సయ్యద్ సమూసిద్దీన్, రత్నకుమార్, బి.కె.రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గణేష్‌కాలనీలో రెండిళ్లలో చోరీ

- భయపడుతున్న నివాసితులు



అప్పలనాయుడు ఇంటి ప్రధాన ద్వారం గడియను విరగ్గొట్టిన వైనం



బెడ్‌రూమ్‌లో చెల్లాచెదురుగా బీరువాలోని వస్తువులు, దుస్తులు

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు గణేష్ కాలనీలో తాళాలు వేసి ఉన్న రెండిళ్లలో దొంగలు పడ్డారు. ఆదర్శ కాలనీగా పేరుగాంచిన కాలనీలో ఒకేరోజు చోరీ జరగడంతో కాలనీ వాసులు భయపడుతున్నారు. వివరాలు... గణేష్‌కాలనీలోని రోడ్డు నెంబర్-1లో చెరుకూరి వెంకట సుబ్బారావు, శ్రీలక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ నెల 13న అమెరికాలో ఉంటున్న కుమారుడు దగ్గరకు వెళ్లారు. ఇంటి తాళం పక్కింటివాళ్లకు ఇచ్చారు.

నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జి.అప్పలనాయుడు భార్య భారతితో కలిసి సొంతింట్లో నివాసం ఉంటున్నారు. వీరు గడిచిన గురువారం ఇంటికి తాళం వేసి తిరుపతి వెళ్లారు. కాగా ఆదివారం తెల్లవారుజామున రెండు ఇళ్ల ప్రధాన తలుపు గడియలు విరగ్గొట్టి దొంగలు లోపలికి ప్రవేశించారు. బెడ్‌రూమ్‌ల్లో ఉన్న బీరువాలు తెరిచారు. బీరువాలోని బట్టలు, వస్తువులను చెల్లా చెదురు చేశారు. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో అటుగా వచ్చిన వాచ్‌మెన్ ఇళ్లలో లైట్లు వేసి తలుపులు తెరచి ఉండడంతో చుట్టుపక్కల వాళ్లకు విషయాన్ని తెలిపాడు. దీంతో వారంతా పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. స్థానికులు అమెరికాలో ఉన్న వెంకట సుబ్బారావుతో పాటు తిరుపతి వెళ్లిన అప్పలనాయుడుకు ఫోన్‌లో విషయాన్ని చెప్పారు. రంగంలోకి దిగిన క్రైం పోలీసులు, క్లూస్ టీమ్ పరిశీలన జరిపారు. అయితే తమ ఇంట్లో ఎలాంటి బంగారు, వెండి వస్తువులు ఉంచలేదని అమెరికా వెళ్లిన వెంకట సుబ్బారావు ఫోన్‌లో తెలియజేశారు. అలాగే చిన్న వస్తువులు తప్పా విలువైన వస్తువులు లేవని అప్పలనాయుడు కూడా చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్రమత్తం చేసినా..

కాగా తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో రోడ్డు నెంబర్-1లో దొంగలు తిరుగుతున్నట్టు అనుమానంగా ఉందని గస్తీ కాస్తున్న వాచ్‌మెన్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు చుట్టు పక్కలవాళ్లను అప్రమత్తం చేశారు. మళ్లీ తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో వాచ్‌మెన్ వచ్చి చూసేసరికి రెండు ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయి.